# కోటిగాడు స్వతంత్రుడు



- పు'కటి కృష్ణారెడ్డి

**కోటిగాడి** మొగంలో కోటి దివ్వెలు ఒక్కసారిగా వెలిగాయి. కోటిగాణి ఇంట్లో వాళ్ళమ్మ 'ఒరే! కోటయ్యా!' అని ఆరాప్యాయంగా పిలిచేది. ఇంటినుండి బయట పడితే స్నేహితులు 'ఒరేకోటీ!' అని ముద్దుగా పిలిచేవాళ్ళు. పూళ్ళో వాళ్ళు 'ఒరే! కోటిగా!' అని దబాయించి పెట్టు పిలిచే వాళ్ళు. ఎవరు ఎలా పిలిచినా పలికే వాడు కోటిగాడు— 'ఎలా పిలిస్తే ఏముంది! అని అనుకొనేవాడు. కానీ., ఆరోజు మాత్రం 'కోటిగాడు' అన్న పిలుపు విని పించే వరికి కోటిగాడి మొగంలో కోటి కాంతులు చోటు చేసుకొన్నాయి.

ఆదరాబాదరా పైకి లేచాడు. తడబడుతూ వేదిక వద్దకు నడిచాడు. ఒక్క ముంపులో ఎగిరి వేదిక మీద పడగల శక్తి ఉన్నా, వెనకా ముందాడుతూ వేదిక నెక్కాడు. వంగి నిలబడ్డాడు. వంగి నిలబడడం 'వినయ' మనుకొంటే అనుకోవచ్చు. కానీ, వాడు రికా తొక్కితొక్కి వినయ వంతు డయ్యాడు.

ఆ వినయ వంతుడు— అందించిన కవర్ని వణుకు తున్న చేతులలో అందుకొన్నాడు. ఆ కవరందించిన పెద్ద మనిషికి ఒక దండం, ఎదురుగా కూర్చున్న ప్రజానీకానికి మరొక్కదండం పెట్టి వేదిక దిగాడు.

వేదిక దిగినా ఏనుగు నెక్కినంత సంబరం వాడిది!

వేదిక దిగిన కోటిగాడు నేరుగా వెళ్ళి తన స్థానంలో కూర్చోకుండా వేదిక ప్రక్కకు వెళ్ళాడు. అక్కడ అప్పటికే అలాంటి కవర్లందుకొన్న కొంత మంది గూనిగాడి ఉన్నారు. ఆ గుంపుతో చేరాడు కోటిగాడు.

అందరి మొగాల్లో పువ్వులు పూస్తున్నాయి.

ఆరోజు ఆగస్టు పదిహేను. భారత దేశపు చరిత్రలో ఆరోజు ఒక అరుదైన రోజు.

ఒకప్పుడు భారత దేశం బానిస దేశం. భారతీయులు తెల్లవాళ్ళ దృష్టిలో నల్లవాళ్ళు. ఈ నల్ల వాళ్ళు ఆ తెల్ల వాళ్ళకు బానిసలు. ఈ బానిసత్వాన్ని భరించలేని కొందరు మహనీయులు స్వాతంత్ర్య సమరం జరిపారు. ఆ పోరాటం ఎంతో శాంతియుతంగా జరిగినా, ఎంతో మంది ఆస్తి పాస్తులు దగ్ధమయ్యాయి. అసువులు గాలిలో కలిసి పోయాయి. జైళ్ళు ఇళ్ళయ్యాయి. ఏది ఏమైనా, స్వాతంత్ర్య సాధన వాళ్ళ ధ్యేయ మయింది.

పట్టుదలకు పరిశ్రమ తోడైతే ధ్యేయ సాధన సల్లేరుపై నడక

ఒక ఆగస్టు పదిహేనున భారతీయులు స్వతంత్రులైనారు.

అప్పటి నుండి ప్రతియేటా, ఆ తేదీని స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపు కొంటున్నారు. మొదట మొదట ఆ ఉత్సవాల్లో ఆనందావేశాలు



## లేబిల్ చింపేయండి ఇంట్లోపెట్టిన ఊరగాయ అనే అనుకుంటారు.

ఔను మరి ఎందుకనుకోరు ? ఇంట్లో పెట్టుకున్న ఊరగాయలకుండే సహజ సువాసన, రుచి జయ ఊరగాయలకే ఉన్నాయి. కారణం ఏమిటో తెలుసా? జయఊరగాయలు మాత్రమే సాంప్రదాయంగా ఇంట్లో పెట్టు కున్నట్టు చేతితోనే తయారు చేయబడ్డాయి. ఇందులో రెండు రకాల కారప్పొడి కలసి వుంది. ఒక పొడి రంగునిస్తే మరో పొడి ఘాటైన రుచి నిస్తుంది. అంతేగాక ఇతర దినుసులు కూడా సరియైన పాళ్ళలో నైపుణ్యము, అనురాగము మేళవించి కలిపేరు.

అందరికీ నచ్చే జయ - అందరూ మెచ్చే ధర 500 గ్రాముల మామిడికాయ పచ్చడి సీసా రు. 9-75* మాత్రమే. 1 కిలో పెద్ద సీసా రు. 14-75* ఆదాకు అసలు పేరు జయ. ఆవకాయ. నిమ్మకాయ. వెల్లుల్లి. పచ్చిమిరప. కొబ్బరి. కలగలుపు కూర గాయలు. మామిడి క్రొత్త రకాలకు పెట్టింది పేరు జయ!

jaya PICKLES
జయ ఊరగాయలు



తలిపిలప్పు ఎంత రసవత్తరంగా ఉంటుందో అంత రమ్యంగా ఉంటుంది జయ

* అమలులోవున్న ప్రకారము స్థానిక, పన్నులు అదనము.

ASSOCIATED /2241

తయారు చేసినవారు :

సంజూస్ నైస్ ఫుడ్స్ అండ్ గుడ్స్ (ఇండియా)
1-10-72/6, బేగంపేట మెయిన్‌రోడు, హైదరాబాద్-500 016.

మిళితమై ఉండేవి. ఆ సంబరానికి పెట్టి పగ్గాలు ఉండేవి కావు. రానురాను ఆవేశం హరించుకుపోయి, ఆనందం మాత్రం, అంతంత మాత్రంగా మిగిలి ఉంది. ఇప్పుడు గతాన్ని తలచి గంతులు వేయడం మాని అంతో ఇంతో ప్రగతి పథం వైపు మొగ్గు చూపిస్తున్నారు.

ప్రగతి సాధన కార్యక్రమంగా జమీందారీ పద్ధతి రద్దయింది. భూస్వామ్య సంస్కరణలు అమలులోకి వచ్చాయి. బాంకులు జాతిపరం అయ్యాయి. ఇలా ఎన్నో ఎన్నెన్నో, కార్యక్రమాలు మిట్టనున్న వాణ్ణి పల్లానికి, పల్లంలో ఉన్న వాణ్ణి మిట్టకు లాగి సమతలంపై నిలబెట్టాలన్న ప్రయత్నంతో ప్రారంభ మయ్యాయి.

ఆ తేదీని స్వాతంత్ర్య దినోత్సవం!

పాఠశాలల్లో పిల్లలకు మిఠాయిలు పంచి పెట్టారు. ఆ పిల్లలకు అర్థం కాని భాషలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురించి ఆవేశంగా ఉపన్యాసాలు ఇప్పించారు. కార్యాలయాలపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి ఎటో చూస్తూ నమస్కరించారు. ఒక తరానికి చెందిన కొందరు పెద్ద మనుష్యులు శుద్ధ ఖద్దరు వస్త్రధారులై గాంధీగారి పటాన్ని ఒక రిక్షాలో పెట్టి ఊరేగిస్తూంటే ఒక హోటలు ముందు నిలువుగాళ్ళ మీాది యువతరం కొందరు 'గాంధీజీకి జై!' అని, మరి కొందరు 'బ్రాందీకి జై' అని, ఆ పిమ్మట అందరూ కలిసి నవ్వలేక నవ్వుతున్నారు. ఆ వూళ్ళో అక్కడకూడ కొన్ని సభలు, సమావేశాలు జరిగాయి. అలా జరిగిన ఒకానొక సభలో—

చిన్న చిన్న దుకాణాలు నడుపుకొనే వాళ్ళకు, వృత్తి కారులకు, వీధులు తిరుగుతూ కూరగాయ లమ్ముకొనే వాళ్ళకు, రిక్షా వాళ్ళకు జాతి పర మైన బాంకుల ద్వారా అప్పు లిప్పించారు.

కోటిగాడికి కూడా అప్పు దొరికింది, కొత్త రిక్షా కొనుక్కోవడానికి.

కోటిగాడు కవరు విప్పాడు. వాడి గుండె దడ దడ లాడింది. కండ్లు మిలమిలా మెరిశాయి. ఆ కవరు నిండుకు నోట్లు! అన్నీ 'ఫళఫళ' మంటున్న కొత్త నోట్లు! ఒకటి గాదు, రెండు గాదు-అయిదు వందలు.

కోటిగాడు బానిస భారత దేశంలో పుట్టలేదు. స్వతంత్ర భారత దేశంలో పుట్టాడు. కాగా కోటి గాడు కడు స్వతంత్రుడు. అయినా వాడు పుట్టి బుద్ధి ఎరిగిన నాటి నుండి అయిదు వందలు కాదు కదా—అయిదు పదులైనా ఒక్కసారిగా కళ్ళ చూచిన పాపాన పోలేదు. అందుకే వాడి గుండె ఆనందంతో ఎగిరి గంతులు వేస్తూ ఉంది.

ఇంత కాలంగా కోటిగాడు రిక్షా తొక్కి బ్రతికినాడు. ఈనాటి నుండి కూడా రిక్షా తొక్కి బ్రతుకుతాడు. అయితే ఆ బ్రతుకులో ఎంత మార్పు!

రిక్షా కోటిగాడు 'ఆపు!' అంటే రిక్షాని ఆపాడు. 'పద!' అంటే ముందుకు సాగాడు. అయిదు నిమిషాలంటూ అర్థగంట ఆలస్యం చేసినా, ఎదురు చూస్తూ నిలబడ్డాడు. తొక్కి గలిగిన చోట ఎక్కి తొక్కుతాడు. మిలుగావి చోట దిగలాగాడు.

మండుతున్న ఎండలో చెమటలు కక్కాడు. కురుస్తున్న వానలో తడిసి ముద్దయ్యాడు.

కోటిగాడికి మరునాటి నుండి కూడా ఈ సాధక బాధకాలు తప్పవు.

అయితే — 'రేపటి నుండి తన సంపాదనలో మూడువంతులు రిక్షా బాడుగ కింద చెల్లించవలసిన అవసరం లేదు. తనదింక కూలిబతుకు కాదు' అనుకొనేసరికి కోటిగాడి మొగంలో కొత్త కాంతులు వెలి విరిశాయి.

కొత్త రిక్షా, కొత్త బతుకు, కొత్త కొత్త ఆశలు కోటిగాడు ఊహల్లో తేలిపోతూ డబ్బు జేబులో భద్రపరుచుకొన్నాడు.

సభ ముగిసింది. ఎవరి దారిని వాళ్ళు వెళుతున్నారు. అయితే కవర్లందుకున్న వాళ్ళు మాత్రం కాలు కదపడం లేదు.

''ఇంకా ఈడ నిల్చుకొని ఏం జెయ్యాలబ్బా? పోదాం పదండ్రా!'' అన్నాడు కోటిగాడు.

''ఒరేవోడివే నువ్వు! అక్కరదీర్తే అక్క మొగుడు కుక్కన్నట్టుందే నీ యవ్వారం? పెంటయ్య రావద్దా?'' ఎదురు పలికింది ఒక గొంతు.

పెంటయ్య కోసం ఎదురు చూస్తూ నిలబడ్డారు.

పేరుకు పెంటయ్యే కానీ, ఆయన చాలా 'పెద్దయ్య.' ప్రజాసేవ ఆయనకు ఊపిరి. సభలు సమావేశాలంటే ఆయనకు అన్నపానాదులు. అనాథలు ఆయనకు ఆప్తులు. రాజకీయ నాయకులు ఆయన జేబులో బొమ్మలు. ఎలహిన వరా, సమస్యలా? అరచేతిలో గీతలు.

ఆ ఊళ్ళో ఏ రాజకీయ నాయకుడైనా అడుగు పెడితే చాలు. ఆయన ముందు నిలబడతాడు. ఆయన వెనక వందలాది బక్క బడుగు ఆకారాలుంటాయి — జై అంటే జై అనడానికి.

ఆ ఊళ్ళో ఏ సభ అయినా, సమావేశమయినా ఆయన లేకుండా జరగడానికి లేదు. ఒక వేళ జరిగినా, ఫలితం జరిపించే వాళ్ళకు తెలుసుగా బట్టి జరిపించరు.

అందువల్ల స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమం పెంటయ్య భుజాల మీదనే నడిచింది. ఆ బరువును దులుపుకొని, స్వాగతం పలికిన పెద్దలకు వీడ్కోలు చెప్పి, చేతికింద మెలిగే మూకకు అప్పగింతలు పలికి, పెంటయ్య బయలు దేరే సరికి కాస్త ఆలస్యమే అయింది.

అంతవరకు కవర్లు ఆయన ఊరి కోసం నిరీక్షిస్తూ నిలబడ్డాయి.

పెంటయ్య బయలు దేరాడు.

మందడి వెంటబడ్డ గొర్రె మందలా కవర్లు వెంట బడ్డాయి.

పెంటయ్య ముందు, కవర్లందు కున్న గుంపు వెనక ముందుకు నడిచారు. పెంటయ్య ఇంట్లో అరుగుపై చేరారు.

తత్తి బరువు నేల వదిలినట్టు నిట్టూరుస్తూ దర్జాగా కుర్చీలో ఆసీనుడు అయ్యాడు పెంటయ్య. ఏదో ఘన కార్యాన్ని సాధించిన తృప్తి అతని మొగంలో తొణికిస లాడుతూ ఉంది.

''ఏ జన్మనో ఏం పాడోగానీ, ఏదైనా పని అనుకుంటే అయ్యేదాకా నిద్దర పట్టదు. ఈ బాధలన్నీ వల్లేక ఎప్పటి కప్పుడు అనుకుంటూనే ఉంటా. ఈ బాదరబంక వద్దెనని. అయినా మీ ఆగసాట్లు చూస్తే ఉంటే 'అయ్యో' అనిపిస్తుంది. నాకు తెలవకుండానే తందూర్చేస్తాను. పెరుక్కొని బయట పడే సరికి తల ప్రాణం తోక్కొస్తుంది. అయినా ఏం చేద్దాం? తలకాయ ఉన్నంత కాలం పడిసెం తప్పుతుందా?'' అని వాళ్ళను ఉద్దేశించి నట్లు కాకుండా తనలో తాను గొణుక్కున్నాడు. వాళ్ళకు వినబడేటట్లుగా ఆ తరవాత—

''ఏం? అందరికీ డబ్బు అందినట్లే గదా?'' అని అడిగినాడు పెంటయ్య. ఆ మూక తోకూపి ముక్త కంఠంతో 'సిత్తం' అనింది.

''అయితే ఇంకా ఆలస్యం చేస్తుండా రెందుకూ? తెండి! తెండి!!'' అడగడంలో దర్పం పడగ విప్పిన పాములా పైకి లేచింది.

ఒక్కొక్కడుగా రెండేసి వందలు ఎంచి ఇస్తాంటే నిర్లక్ష్యంగా కుడిచేత్తో అందుకుని ఎడమ వైపు జేబులో కుక్కు కుంటున్నాడు పెంటయ్య.

కోటిగాడు మాత్రం వినకరిస్తూ ఒక మూల నిలబడ్డాడు. వాడికి ఈ తంతు అంతు చిక్కడం లేదు.

''ఏరా, కోటిగా, అట్టె నసగతా నిలబడ్డావే? ఏం సంగతి? తేతే! నాకింకా ఒపిసిన్ని పన్లుండాయి.'' అసహనంగా అడిగాడు పెంటయ్య.

''అయిదు వందల అప్పులో రెండొందలు నీకే ఇచ్చేస్తే నే నింకా రిక్షా ఎట్టా కొనాల? అప్పెట్టా తీర్చాల?'' సందేహాన్ని వెలిబుచ్చాడు కోటిగాడు.

ఇంటిపై కప్పు పైకెగిరి పోయేలా విరగబడి నవ్వాడు పెంటయ్య.

నవ్వుతున్న పెంటయ్యను, నవ్వుతుంటే కలిసి నవ్వకపోతే బాగుండదని ఆయనతో కలిసి నవ్వుతున్న గుంపును దేబిరించి చూస్తూ నిలబడ్డాడు కోటిగాడు.

# పుట్టిన ఊరు కట్టంగ

— పి. గణపతిశాస్త్రి

గోదావరి తీరాన ఎత్తయిన ఏటి గట్టు పక్కనే
నిలిచి, ఎలుగెత్తి పిలిచి, చల్లని కళ్ళ తల్లిలా
పలకరిస్తుంది నేను పుట్టిన పల్లెటూరు కట్టుంగ.
తెల్ల తెల్లని పాల వెన్నెల, రేఱ్ఱ పూల
జల్లులు కురిపించే అపరాత్రి వేళ,
దట్టమయిన మంచు దుప్పటి కప్పుకుని,
పండు ముదుసలి ముత్తయిదువులా
పండుకుని నిద్రిస్తుంది నేను
జన్మించిన పుణ్య భూమి కట్టుంగ.
మామిడి తోపుల చిక్కని ముసుగులో
చలి మంటల వెలుగుల్లో
పసివారి కేరింతాలతో
బాటలపై రెండెడ్ల బళ్ళ మువ్వల సవ్వడులతో
పండి ఒరిగిన పచ్చని పైరుల గల గలలతో
పాడి పంటలతో, పండుగలతో
కల కల లాడుతూ ఉంటుంది నేను
మెట్టిన పల్లెటూరు కట్టుంగ
ఇటీవల నా పల్లె ఒకసారి చూచి వద్దామని
ఎంతో ఉబలాట పడి శ్రమపడి నా ఊరు చేరుకున్నాను.
కాని నన్నెవ్వరు గుర్తు పట్టలేదు! ఒక్కరయినా
నా మాట పట్టించుకోలేదు! ''అయ్యో! నా
చిననాటి స్నేహితు లెలాంటి దారులు పట్టి
ఏమయిపోయారో!'' అనుకుని ఉసూరు మని
నిట్టూర్చి, పుట్టెడు దిగులుతో కుంగిపోయాను నా కట్టుంగలో.
అంతలోనే ''ముదిమి, మృత్యువు మన
సమీపానికయినా రాలేవు సుమా! మన మందరము
అజరామరులం సుమా!'' అని ఏటి కెరటాల
గుస గుసలతో నా చెవిలో రహస్యం చెప్పింది
ఆపూర్వ పుణ్య సుకృతాల ఫలితమై
తరలించిన నేను పుట్టిన పల్లెటూరు కట్టుంగ.

*

నవ్వును ఆపుకోవడానికి పెంటయ్యే కొస్త కాలు పడవలసి వచ్చింది.

"ఒరే కోటిగా! నీలాంటి పిచ్చోళ్ళుండే గదరా ఈ దేశం ఇట్లాయి పోతా ఉండేది! నిన్ను రిక్షా కొనమనిం దెవుడు? అప్పు పట్టమనిం దెవుడ్రా? సెప్పండయ్యా సెప్పండి! మీరన్నా సెప్పండి వాడికి."

ఏం చెప్పాలో? ఎలా చెప్పాలో తోచకుండా ఒకరి మొగం ఒకరు చూచుకొంటూ నిలబడిం దా గుంపు.

"ఏవండయ్యా? సెప్పడానికి మీా సేతకాలేదా? అయితే నేనే సెప్తా?" అందరినీ తేరిపార చూచి గొంతు సవరించు కున్నాడు పెంటయ్య.

"ఒరే కోటిగా! నీకు అప్పు పుట్టించడానికి రిచ్చా అడ్డం పెట్టుకోవలసొచ్చింది. వాలాంటోళ్ళు బతకడానికి నీలాంటోళ్ళు అవసర మొచ్చింది. అంతేరా! అంతే! రొండొంద రిట్లా పారేసి మిగతి మూడొందలు పట్టుకెళ్ళు. గుడ్డా గుసురుకొనుక్కో. రొన్నాళ్ళు అంత పచ్చంగా తిని, ఎచ్చంగా పొడుకో!'

పెంటయ్య ఉపదేశ వాక్యాలు కోటిగాడి చెవి కెక్కలేదు. వాడి మనస్సంతా కొత్త రిక్షా మీాద కొట్టుకులాడుతూ ఉంది. ఎటూ తోచక అయో మయంగా చూస్తూ నిలబడ్డాడు.

"అట్లా గుణస్తు ఉండావేందుకురా, గుడ్డినా కొడకా! ఏందో నీ యబ్బ సొత్తు ఎత్తిచ్చినట్లు యాదనపడిపోతుండావే? అహా! నీ కేమయినా ఇల్లుందా? వాకిలుందా? భూమీా బుట్రా ఉందా? ఏవుందిరా నీకు? మరి ఎరి మొకం చూసుకొనిచ్చి వారనుకొ్రా అప్పు?"

ఆ మాట అంటూ అందరి వైపు అపహాసంగా చూశాడు పెంటయ్య. అందరు చేతులు మూడిచి తలల్ని తోకలు చేసి ఆడిస్తున్నారు. పెంటయ్య కొస్త శాంతించాడు.

"ఒరే కోటయ్యా! ఆ మాట కొస్తే ఈ ఆయి దొందల్లో పెద్ద భాగం వీదేరా పిచ్చోడా? నువ్విచ్చే బోడి యిన్నూరుకింక ఇరవై మంది మొగుళ్ళుండారు. తెలిసిందా? అంతేరా అంతే! పాపమని పాతకోకిస్తే ఇంటెనకుపొయ్యి మూరేసుకున్నెబోదంట నీలాంటి ఒకామె. అట్లుంది యివ్వారం! తేరా తే!"

మంచిగానే కోటిగాణ్ణి వంచేశాడు పెంటయ్య.

వచ్చిరాని మనసుతో ఆడీ ఆడని చేతులతో రెండు వందలు అంద చేశాడు కోటిగాడు. వాడి మనసు కకావికల మయింది. కొత్త రిక్షా వోనర్‌గా వాడు కట్టుకొన్న పేక మేడలు కంటెదుటే నిల వునా కూలిపోయాయి. ఒక నిమిషం అక్కడ నిల బడలేకపోయాడు.

కోటిగాడు నడుస్తున్నాడు. తనకు జరిగిన అన్యా యాన్ని కోటి గొంతులతో ఘోషించాలని పరిత పిస్తూ నడుస్తున్నాడు.

ఎవరితో చెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి? ఎలా చెప్పుకోవాలి?

రిక్షావాడు చెబితే వినే వాళ్ళుంటారా ఈ లోకంలో?

పోనీ తాను చెబితే ఎప్పుడు వినిం దీ లోకం? వినక లేదా సైగా పట్టుకొని తన్నింది.

అమ్మ కూలీ నాలీ చేసి మానెడు నూకలు తాను కష్టేలమ్మి పాతలా పరకా తెచ్చేవాడు. అ పల్లె టూళ్ళో వెన్నెళ్ళుకుచన్నీళ్ళుగా బ్రదుకు సాగిపోతూ ఉండేది. ఆ గానుగెద్దు బ్రదుకు అలానే కొనసాగి ఉంటే చీకూ చింతా ఉండేది కాదు. తన కర్మకాలక పోతే తమ్మిరెడ్డి— చంగమనాయుడు దారి జగడం ఇంటిదాకా అన్నట్లు ముత్యాలమ్మ తిరణాల కోసం— నువ్వెంత? అంటే నువ్వెంతరా? అని జుట్లు జుట్లు పట్టుకోవాలా? ఆ సమయానికి తానక్కడే ఉండాలా? అంతటితో ఆగకుండా ఆ వ్యవహారం కోర్టువరకెక్కాలా?

* * *

నాలుగయిదు బాటలు కలిసే కూడలి అది. ఆ కూడలి వద్ద నిలబడ్డాడు కోటిగాడు. ఎటుపోవాలో తోచక ఒక క్షణం ఆలోచిస్తూ నిలబడ్డాడు. ఆ బాటల్లో ఏ బాట మీాద పడినా ఏదో ఒక గమ్య స్థానం దొరుకుతుంది. అయితే మనిషి ఏదో ఒక బాటనే ఎన్నుకొంటాడు. అలా ఎందుకు చేస్తాడో అతనికే తెలియదు. అదే జీవితంలో విచిత్రం. ఎప్పుడు, ఎక్కడ, ఎలా మలుపు తిరుగుతాయో జీవితాలు!

అనుభవంతో వాడి ఆలోచనా విధానం వాడికే చిత్రంగా ఉంది.

తనలో తాను నవ్వుకొంటూ నడుస్తున్నాడు— ఒకానొక బాట మీాద. అది ఎక్కడ చేరుస్తుందో ఏమో? చూడాలి మరి.

• • •

ఆ వ్యవహారం జరిగి నెల తిరగకముందే ఒకరోజు మాటు మణిగిన వేళ తమ్మిరెడ్డి పిలిపిస్తే తాను వెళ్ళాడు.

"ఒరే కోటిగా! చూస్తివి గదరా నాయుడిగాడి నిక్కు? వాణ్ణి ఒక్క దినమయినా పదారుకమ్మి లెనకు పంపించకపోతే నీ రెడ్డిబిడ్డే కాదనుకో! అయితే యవ్వారమంతా నీమీాందే ఉంది. జరిగింది జరిగినట్లే చెప్పు. అమిందట నీ జరుగుబాటు నా కొదులు. ఏమంటావ్?"

దాదాపు దబాయించినట్లే అడిగాడు తమ్మిరెడ్డి.

"అట్లాగేనయ్యా!" అన్నాడు తాను.

ఆ మరునటిరోజు సందకాడ చంగమనాయుడు సరాసరి తన గుడిసెకే వచ్చాడు. చీలుస్తున్నకట్టెల్ని ఎక్కడి వక్కడ వదిలి చేతిలో గొడ్డలి పక్కని బెట్టి రెండడుగుల్లో వచ్చి నాయుడు ముందు నిల బడ్డాడు.

"ఒరే కోటీ! ఎంతకాలమని ఇట్లా కట్టెలుకొట్టి చస్తావురా! ఒంట్లో అంత రమున్నంతకాలం ఫరవా లేదనుకో! ఆ తరవాత? అందుకేరా ముందు సూపుండా లన్నారు పెద్దోళ్ళు. నా మాటిన్నావంటే — ఆ ముత్తేలమ్మ సాచ్చిగా చెప్తా ఉండా— రొండెం కణాల పూరిల్లు ఒకెకరా మడి—ఏమంటావ్?"

ముంగాళ్ళకు బంధమే వేశాడు చంగమ నాయుడు.

ఎటూ నోరు కదపలేక గుడ్లప్పగించి చూస్తూ నిలబడ్డాడు తాను.

"రెడ్డోడి తింపురు చూస్తివిగదరా? అయినా మాణిసికి అంత పెగ్గె పనికి రాదురా! వాడి తిక్క కుదిరించక పోతే నే నబ్బ అమ్మకు కాదు పుట్టింది. అయితే అంతా నీ సేతుల్లో ఉండాది. ఏంచేస్తావో ఏవో మరి!"

రెండు చేతులు పట్టుకోలేదు కానీ పట్టు కొన్నంత పని చేశాడు నాయుడు.

"అట్లాగేనయ్యా!" అన్నాడు తాను వంగిగా.

రెండు పొట్టేళ్ళు ఢీ కొన్నాయి. వాటి మధ్య తల దూర్చితే చిత్తయిపోవడం ఖాయం.

కోర్టులో సాక్ష్యం చెప్పాలి. 'సాక్ష్యం' అంటే ఎవరివైపో ఒకరివైపే చెప్పాలి. ఒక వైపు చెబితే మరొక వైపు కన్నెర్ర చేస్తుంది. అదీ కాక వాళ్ళ


## పెండ్లికి ముందు, తర్వాత!

నరముల బలహీనత, శుక్లనష్టము, శీఘ్ర స్ఖల నము, ఇతర సెక్స్ సమస్యలకు, చర్మ వ్యాధులకు (ఏ రకమైననూ), ఫైలేరియా, దమ్ము, ఆయాసము, ఉబ్బసము, అజీర్ణ వ్యాధులకు ప్రత్యేక చికిత్స. పోస్టు ద్వారా కూడా ఔషధములు పంప బడును. వివరాలకు 50 పై.లు స్టాంపులు పంపండి.

**బాబా అండ్ కో ఆస్పత్రి,**

తాలూకా ఆఫీసు ఎదుట, విజయవాడ-3.





# మస్తిష్కపు పుటల్లోంచి...

నా మస్తకంలో పుస్తకంలా పడుకున్న
ఆలోచనల పుటలను వెనక్కు తిప్పాను
సింహావలోకనం చేసుకుంటున్నాను—
పుస్తకాల పుటల చిరుగంటల సవ్వడి విన్నాను
వివేచన కొలమానంతో
అవసరాలను, అనవసరాలను వేరు చేసి
హంసలా మంచిని మాత్రమే జీర్ణం చేసుకున్నాను
అందుకే నా జీర్ణకోశం బలంగా ఉంది
నేను ఈ భూమండలాన్ని
నా తల వెంట్రుకతో బంధించగలను
నేను పుస్తకంనుండి రసవాదం నేర్చుకున్నాను
మట్టిని ముట్టి పసిడిగా మార్చగలను
అంతేకాదు—
పసిడికి పరిమళాన్ని జత కూర్చగలను
పాటను తలలో నింపుకున్నాను
కొత్తను గుండెమీద కూర్చుండబెట్టుకున్నాను
అరచేతులలో ఆశయాల స్వర్గాలు నిలుపుకున్నాను
మొన్ననూ నిన్ననూ కాదు—రేపునూ చూశాను
నా గుండె గుడి గోపురం మీద
నవ కవిత్వపు జెండా రెపరెపలాడించాను
నా స్వర పేటికలో పాటలను మూటపెట్టాను
నా నాలుకతో పద్యాన్ని మద్యంలా సేవించాను
నా వెన్నెముకకు వ్యాస కేతనం కట్టాను
నా మోకాలి చిప్పతో నాటకాలు ఆడించాను
కథలను నా పెదవుల మీద పరచుకున్నాను
నా పాకెట్ థియేటర్‌లో నవలను ప్రదర్శించాను
నా కడుపులో చుమ్మలు చుట్టుకున్న
ఆకలి ఆత్మ కథను విన్నాను
కాలం జీవిత చరిత్రను కన్నాను
నా అరికాళ్ళలో
జాతి సాహిత్యాన్ని భూస్థాపితం చేశాను
నా కళ్ళకి ఎన్నో—ఎన్నెన్నో
అడుగు జాడలు అడ్డదిడ్డంగా అగుపించాయి
ఆలోచించి ఆ అడుగు జాడలను చించి
నా దారిని నేను వేసుకున్నాను
నా మార్గం నాది, నా అనుభూతి నాది
పుస్తకం ఎంత తీసినా తరగని గని
పుస్తకం విజ్ఞాన ధనం పదిల పరచిన
తాళంకప్ప లేని ఇనప్పెట్టె
పుస్తకం తరతరాల యుగయుగాల
ఆలోచనలను రికార్డు చేసే టేప్ రికార్డర్
పుస్తకం టంగ్ క్లీనర్ కాదు
మైండ్ క్లీనర్
పుస్తకం హస్తభూషణం కాదు
మస్తక భూషణం
నేను పుస్తకం కంచంలో
అమృతం పోసుకొని గ్రున త్రేన్చాను
అందుకే నేను అమరుణ్ణి
నేను దిక్కులే అంబరంగా ధరించి
నడుస్తున్న గ్రంథాలయాన్ని
నా జీవితం తెరచిన పుస్తకం
నా ఆలోచనలకు మృత్యువు లేదు.

**- ఎ. సూర్యప్రకాశ్**

---

పెద్దోళ్ళు. ఈరోజు జుట్లు జుట్లు పట్టుకొంటారు. మళ్ళీ అవసరమొస్తే చేయి చేయి కలుపుకొంటారు. ఎటొచ్చీ ఇద్దరి మధ్య ఇరుక్కొని పెరుక్కోలేక యాతన పడేది తనలాంటి వాళ్ళే.

అటు నూయి. ఇటు గోయి. ఏం చేయటలి? కోటిగాడు ఆలోచించాడు. తన చిన్న బుర్ర వేడెక్కేవరకు ఆలోచించాడు. ఎంత ఆలోచించినా వాడికి తోచింది ఒక్కటే మార్గం.

రెక్కాడితే కాని డొక్కాడని బ్రతుకు చిత్తైనా పుత్తూరైనా కాకుంటే మరే ఊరైనా ఒక్కటే! లేదంటే, ముసలిది ఉంది. ఎక్కడో అంత బ్రతుకు తెరువు దొరికితే ఆ తరవాత ఆమెను పిలుచుకొని పోతే సరిపోతుంది.

ఈ నిర్ణయంలో ఒక అర్ధరాత్రి ఇంటి నుండి బయటపడ్డాడు.

కొత్త జీవితం మీద కోటి ఆశ. కని పెంచిన తల్లిని పుట్టి పెరిగిన పల్లెను వదులుతున్నందుకు గుండెల నిండుకు కొండంత గుబులు.

భళ్ళుమని తెల్లవారే వరకు నడిచాడు.

కనుచూపు మేరలో ఒక పెద్ద పట్టణం. పెద్ద పెద్ద భవనాలు అందంగా కనిపిస్తున్నాయి. ఆ పట్టణానికి మధ్యగా ఆ భవనాలను మించి వాడి ఆశలకు ప్రతీకగా ఒక ఎత్తయిన గోపురం. ఒంగోలు గిత్త మూపురంలా కనిపిస్తూ ఉంది. గోపురం ఉండే గుడి ఉంటుంది. గుడి ఉండే గుళ్ళో దేవుడు ఉంటాడు. దేవుడు ఉండే ఊళ్ళో నిజంగా దేవుడి లాంటి మనుష్యులే ఉంటారు. అంత మంచి ఊళ్ళో ఇంత చిన్న ప్రాణానికి రవ్వంత చోటు దొరకక పోతుందా?

కోటిగాడి ప్రాణం లేచి వచ్చింది. మరీ తెంపుగా నడుస్తున్నాడు.

ఆ పట్టణంలో ఉన్న పెద్ద పెద్ద భవనాలు పెరిగిపోతున్న జనాభాకు చాలవన్నట్లుగా అంత కంటే పెద్ద పెద్ద భవనాల్ని కడుతున్నారు పూరిముందు. ఆశగా అక్కడికి వెళ్ళాడు. ఆలోచిస్తూ నిలబడ్డాడు. ఆలోచించవలసిన అవసరం లేకనే నేల మీద తట్ట నెత్తికెక్కింది.

పొద్దుగూట్లో పడే దాకా తట్ట మోస్తే పొట్ట గడుస్తూ ఉంది.

'బయలుదేరిన వేళా విశేషం మంచిదే!' అనుకొన్నాడు. కాలికి కాలు కొట్టుకొంటూ ఒడవుల మీద పడి కబ్బేలు తేవడం కంటే తట్ట మోయడం సులువుగా ఉంది. నాలుగు రాళ్ళు వెనకపడితే వెళ్ళి అమ్మను పిలుచుకొని రావాలి — అనుకొన్నాడు.

అంతవరకు బాగానే ఉంది. అయితే —

ఒకరోజు వేళ కాని వేళ అనుకోనట్లుగా ఇంజినీరు వచ్చాడు. తనిఖీ కోసం ఆ సమయాన సిమెంటును ఇసుకను కలగలుపుతున్నారు కూలీలు. అక్కడ ఒక్క క్షణం నిలబడ్డారు ఇంజనీర్!

'ఎన్ని తట్టలు ఇసుకకు ఎన్ని తట్టలు సిమెంటు?' ఇంజనీర్ అడిగాడు.

"ఆరు కొకటేస్తూ వుండాం సార్!" అన్నాడు కూలీల మేస్త్రి. వాడు పాత పందికొక్కు. ఎవరికెలా చెప్పాలో వాడికి బాగా తెలుసు.

"ఒరే! ఒరే! అబద్ధం చెప్తే ఆడబిడ్డలు పుట్టార్రా! పది కొకటేస్తే ఆరు కొకటంటావు గదరా అన్నాయమున్నదా?" అమాయకంగా అన్నాడో, ఆలోచించే అన్నాడో! అనకూడని మాట అనేశాడు కోటిగాడు.

చివ్వున పైకి లేచాడు ఇంజనీర్.

గాలికి ఎగిరే కాగితం మీద బరువు పెడితే ఎగరదు. అరిచే కుక్క నోటికి కవళం పడితే అరవదు. కోపం వచ్చినప్పుడు ఈ కోవకు చెందుతారు ఆఫీసర్లు అని ఎరిగిన కంట్రాక్టర్ అత్యంత చాకచక్యంతో ఆఫీసరు జేబులో బరువు పెట్టాడు. బరువు పడేటప్పటికి ఎగరడం మాని వగర్చడాని కారంభించాడు ఆఫీసర్.

"ఇదో ఇలాంటి మాటలు ఇంక చెవిని పడితే టెండర్లే కాన్సిల్ చేస్తా! ఏమనుకున్నారో, ఏమో? జాగ్రత్త!" అని హెచ్చరిస్తూ బయలుదేరాడు ఇంజనీర్, జేబులో బరువు మోస్తూ నిలబడలేక.

ఇంజనీర్ అటు వెళ్ళడం, కంట్రాక్టర్ ఎగిరి నడ్డిమీద తన్నడం, కోటిగాడు నడిరోడ్డులో బోర్లగిలా పడడం అతి సహజంగా, సవ్యంగా జరిగాయి.

కోటిగాడు పైకి లేచాడు. తిరిగి చూడకుండా ముందుకు నడుస్తున్నాడు.

దేవుడు ఉండే ఆ పట్టణంలో ఒక దేశనాయకుడి పేరుమీద వెలసిందా రాజవీధి. పేరు గాంధీరోడ్డు.

గాంధీ రోడ్డులో బట్టల కొట్లు ఉన్నాయి. ఫాన్సీ షాపులు ఉన్నాయి. పాత్రల అంగళ్ళు ఉన్నాయి. మెడికల్ షాపులు ఉన్నాయి. మాంసాహార, శాకాహార హోటళ్ళు ఉన్నాయి. ఫోటో స్టూడియోలు ఉన్నాయి. అక్కడక్కడ ఈ అంగళ్ళ మధ్య అలంకార ప్రాయంగా బ్రాందీషాపులు ఉన్నాయి.

ఈ అంగళ్ళన్నింటి ముందు రోడ్డు కిటువైపు, అటు వైపు రోడ్డంతా వ్యాపించి కలిగిన వాడి నీడలో బతుకే లేనివాడిలా చిన్న కొట్లు ఉన్నాయి. నాలుగు చక్రాల బండ్లమీద పండ్ల అంగళ్ళు నాలుగు బార్లకు ఒకటి ఉన్నాయి. ఆ బండ్ల మీద ఒయ్యారంగా వాలి ఒక ద్రాక్షపండునో, జామపండునో కొరికి తింటూ పోలీసు వాళ్ళు ఉన్నారు. ఏమరితే పిడికెడు ఆకు కూరనో, లేదు అరటి పండ్లనో నోటి కందుకోవడానికి ఆవులు ఉన్నాయి గేదెలూ ఉన్నాయి. మేకపోతులు ఉన్నాయి. వీటన్నింటితో కలిసి మనుష్యులూ ఉన్నారు.

ఆ రోడ్డు మీద నిలబడ్డాడు కోటిగాడు.

అక్కడ ఎవరి దారి వాళ్ళదిగా ఉంది. ఎవరి పని వాళ్ళదిగా ఉంది. ఎవరి మాట వాళ్ళదిగా ఉంది.

"ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి?" అని తనలో తాను గొణుక్కున్నాడు.

ఆకలి పీకుతూ ఉంది. నిలబడలేక అంగడి ముందు కూర్చున్నాడు. కూర్చున్నా, నిలుచున్నా ఆకలి ఆకలే! ఆకలి తీరాలంటే అంతో ఇంతో పడాలి. అంతో ఇంతో పడాలంటే డబ్బు కావాలి. అదే లేదు తన దగ్గర. ఏం చేయాలి?

"ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి?" అనుకుంటూ నడుస్తున్నాడు కోటిగాడు అంతకంటే చేసేదిలేక, తెలియక.

ఒక్కడ వరుసగా అయిదారు హోటళ్ళు. ఆ హోటళ్ళ ముందు నిలబడి వచ్చే పొయ్యే వాళ్ళను 'భోజనం చేస్తావా బాబూ! చేస్తావా బాబూ!" అని ఆప్యాయంగా అడుగుతున్నారు.

ఆశ్చర్యంగా చూస్తూ అక్కడ నిలబడ్డాడు కోటిగాడు.

'భోజనం చేస్తావా, బాబూ!' ఒకానొకడు అడుగుతున్నాడు ముద్దుగా.

ఆపంరరగా తల ఆడించాడు కోటిగాడు.

సాదరంగా లోనికి పంపాడు కోటిగాడు.

అక్కడ వాడు జంకుతూ ఒదిగి ఒక వారగా నిలబడితే టేబిలు ముందు కూర్చోమన్నారు. ఒకడు విస్తరి పరిచాడు. ఒకడు నీళ్ళు పెట్టాడు. మరొకడు విస్తరి నిండుకు అన్నం పెట్టాడు. ఇంకొకడు కూరలు వడ్డించాడు.

ఆవు రావురుమని ఆకలి.

గుడ్డెద్దు చేలో పడ్డట్టు తింటున్నాడు కోటిగాడు.

"కోడి కూర వేపుడు. చేపల పులుసు. పెట్టమంటావా, బాబూ!"

ఇంకొక్కడు అడుగుతున్నాడు.

వాళ్ళ ఆదర భావానికి ముగ్ధుడై పోయాడు కోటిగాడు. దేవుడున్నవూళ్ళో దేవుడిలాంటి మనుష్యులే! అనుకొన్నాడు. నోటి నిండుకు కూడు. బదులు చెప్ప లేక జోరుగా తల ఆడించాడు.

అడిగి అడిగి వడ్డిస్తే తుమ్మితే ముక్కులో నుండి పడేదాకా మెక్కాడు. తృప్తిగా త్రేన్చుతూ బయటికి నడుస్తున్నాడు. 'తొమ్మిదిప్పర!' అని ఒక గావు కేక పెట్టాడు సర్వర్.

తన కేమీ పట్టనట్టుగా, తన లోకం తనదిగా హాయిగా నడుస్తున్నాడు కోటిగాడు. అంతలో ఎవడో జబ్బ పట్టి నిలబెట్టి, 'బిల్లు చెల్లించరా బేటా!' అన్నాడు.

తెల్ల మొగం వేశాడు కోటిగాడు. అంతలోనే తేరుకొన్నాడు.

"ఇదేమి అన్యాయ మయ్యా? పిల్చి కూడంత పెట్టి డబ్బడుగుతుండారే?"

వాడి మాటలకు పగలు పడుతూ నవ్వింది హోటల్!

"ఇది సత్రం కాదురా కొడకా! హోటల్!"

'భోజనం చేస్తావా బాబూ!' అని మర్యాద చూపిన వాడే మర్యాద తప్పి మాట్లాడుతున్నాడు.

"ఆదేందయ్యా అట్లా మాట్లాడతారే! ఓటల్లో అయితే అడిగితేనే పెట్టాలి. అడక్కుండానే అడిగడిగి పెట్తిరి. మావూళ్ళో కూడా పండగ పబ్బాలకు ఇట్లానే పిల్చి పిల్చి పెడ్తారు. అట్లానే అనుకుంటి. 'ఎంత మంచోళ్ళు!' అని అనుకుంటూ పెట్టింది తింటి. ఇప్పుడు దుడ్డడిగితే నేనేం జేసేది?'

కోటిగాడి వంగి మాటలకు పగలబడి కాదు, పగల బడి నవ్వింది హోటల్. "ఏం చేయలా? ఏం చేయాలో చెప్తాంరా!" అంటూ మెడబట్టి గెంటారు. ఎంగిలి గిన్నెల ముందు పడ్డాడు కోటిగాడు. వాడి శ్రద్ధతో ఎంగిలి గిన్నెలు, లోటాలు తళ తళ మెరిశాయి.

వాడి శ్రద్ధను గమనించారు యజమానులు. ఒక్కొక్క మెట్టుగా వాడు పైకెక్కాడు. కొంత కాలం మేజాలమీది ఎంగిలి గిన్నెల్ని ఎత్తుకొని ఇంకొకడి ముందు కుప్ప పోశాడు. ఆ తరవాత ఆకు పరిచి నీళ్ళు పెట్టాడు. తరవాత సర్వర్ అయ్యాడు.

మూడు పూటలా ముక్కువరకు మెక్కడం, నీడపట్టున ఉండడం—మనిషి మిన మిన లాడుతున్నాడు. అలానే కొనసాగి ఉంటే అదొక్క తీరుగా ఉండేది. కానీ—

ఒక రోజు ఆరబోసిన అన్నంమీద మున్నువు నీళ్ళు చల్లుతున్న దృశ్యం వాడి కంట పడింది. వాడి కడుపు రగిలిపోయింది. చూస్తూ చూస్తూ పూరకుండాలేక పోయాడు. 'తినే వాళ్ళ నోళ్ళు యిట్లా కొడ్తే ఈళ్ళ నోళ్ళు దేవుడే కొడ్తాడు." అనకూడని మాట అననే అన్నాడు. ఆ మాట అనుకోకుండా అక్కడికి వచ్చిన యజమాని చెవిని పడింది. ఏ మాత్రం ఆలస్యం లేకుండా వాడి నోటిమీద దెబ్బ పడింది.

ఆ దెబ్బతో వీధిలో పడ్డాడు.

ఇప్పుడు ఒంట్లో కాస్త సత్తువ ఉంది కాబట్టి ఆ దెబ్బకు తట్టుకొని నిలబడ్డాడు. నిలబడి 'ఏం చేయాలి?' అని ఆలోచిస్తున్నాడు.

తలమీద కుచ్చుల కుళ్ళాయి, నోట్లో సిగరెట్టు, కాళ్ళకు ప్లాస్టిక్ చెప్పులు, రిక్షా హేండిల్ బార్‌కు మల్లెల సరాలు, రిక్షాలో చుక్కలాంటి చక్కని చుక్క!

దర్జాగా తొక్కుతున్నాడొకడు రిక్షా.

'ఇదీ స్వతంత్ర వయిన బతుకంటే!' అనుకొన్నాడు కోటిగాడు.


ఆ నాటినుండి రిక్షా తొక్కుతున్నాడు. ఆకలు ఆశయాన్ని కలిపి ఏ నాటి కయినా తొక్కే వాడిదే రిక్షా కాకపోదులే అన్న ధైర్యంతో తొక్కుతున్నాడు. ఆ ఊళ్ళో ఎందరో ఒకప్పుడు రిక్షా తొక్కినవాళ్ళు ఇప్పుడు ఒకటికి పది రిక్షాల 'ఓనర్లు' అయ్యారు. 'తనకూ అలాంటి అవకాశం రాకపోదులే' అన్న ఆత్మ విశ్వాసంతో తొక్కుతున్నాడు.

అవకాశం వచ్చింది. అయితే 'రామా వచ్చె! సోమా పాయె!' అన్నట్లు చేజారి పోయింది. ఆకాశ మంత ఎత్తుకు ఎదిగిన కోటిగాడు అమాంతంగా పాతాళంలో పడిపోయాడు.

* * * *

కోటిగాడు నడుస్తున్నాడు. కొంపలు తగలబడి వంత బాధతో నడుస్తున్నాడు. నడిచి నడిచి బాగా అలిసిపోయాడు.

అలిసి సొలిసిన కోటిగాణ్ణి సేద దేర్చడానికి అమ్మ లేదు. వాడి బతుకులో అలాంటి యోగ్యత కలిగించింది ఒక్కటే ఒక్కటి. అది గవర్నమెంటు సారాయి అంగడి.



## యాత్ర

నీవు వెంట ఉన్నావనే
నమ్మకతో
ఈ యాత్ర ఆనందంగా
సాగిస్తున్నాను, స్వామీ!
దారిలో నేను
కనుపించనప్పుడు
నీలోకి చూసుకో—
అక్కడుంటాను.

—గోవిందరాజు రామకృష్ణరావు

స్వాతంత్ర్య దినోత్సవం—అప్పు లేక పప్పు కూడు. కోటిగాడికి సారాయి అంగడికి పోవలసిన గతి పట్టలేదు. సరాసరి బ్రాందీ అంగడికే నడిచాడు.

బ్రాందీ అంగడి ముందు నిలబడ్డాడు ఒక్క క్షణం. ఒటు చూశాడు. గాంధీ బొమ్మ. చేతు లెత్తి ఒక్క దండం పెట్టాడు. ఇటు చూశాడు. బ్రాందీ అంగడి. చేతులు జోడించి రెండు దండాలు పెట్టాడు. మళ్ళీ గాంధీగారి వైపు తిరిగాడు.

"ఓ పెద్దాయినా! పొద్దున అందరూ నిన్ను గురించి మాట్లాడేవోళ్ళే! నువ్వు సొతంత్రం తెప్పించి నావంట. మాలాంటోళ్ళు అంత తిండీ గుడ్డ సొతంత్రంగా సంపాయించుకోవాలని సతపోరినా వంట. ఇంకా ఏమేవో జెప్పిరి. ఇన్నప్పుడు అంతా తెలిసినట్టే ఉండె. ఇప్పుడు సెప్పుకుందా వంటే శాతగాకుండా ఉంది. అదట్లాపోనీ! పొద్దుగూకులూ ఈ దోవ మిందే రిక్షా తొక్కుంటూ ఎన్నిసార్లు పోయినానో? ఏనో? లెక్కేలేదు. అయితే మాత్రం మాయబ్బతో సెప్తావుండా! నువ్విడున్నట్లే తెల్దు. ఇప్పుడు తెలుసుకున్నా! — కాస్సేపుండు. వచ్చేస్తా! ఇయ్యాళ నీతో శానా శాన చెప్పుకోవాల!"

గాంధీ గారి దగ్గర సెలవుతీసుకొని కోటిగాడు బ్రాందీ అంగట్లో దూరాడు.

ఒక చిన్న సీసా మందును రెండు సోడాలతో కలిపి రెండు గుక్కల్లో గుటగుట తాగేశాడు. అలుపు అవిరై పోయింది. హాయి గుండెలో గూడుకట్టు కొంటూ ఉంది. తూలుతూ తేలుతూ వచ్చి కోటిగాడు గాంధీ గారి ముందు నిలబడ్డాడు.

"నువ్వేజెప్పు, సా వీ! ఇదే వన్నా బాగుందంటావా? అప్పు తీసిస్తానని. కొత్త రిచ్చా కొనుక్కోవచ్చని ఆశ చూపెట్టి. నా బతుకు నాదిగా సొతంత్రంగా బతకదా వనుకుంటి. ఇచ్చినట్లేచ్చి పెరుక్కుంటారా? నువ్వే గద,సా వీ, వాళ్ళకీసొతంత్రం ఇచ్చింది? ఇందుకేనా సా వి సొతంత్రం ఇచ్చింది?"

గాంధిగారు బోసినవ్వుల నవ్వుతూనే ఉన్నాడు.

"అదేంది, సా వీ! నేను సెప్తావుంటే నువ్వు నవ్వతా ఉండావే? నా బాద నీకు 'సీవ కుట్టినట్లనిపించలేదే? 'వాళ్ళు చేసింది మంచి పనేలే!' అని నవ్వతా వుండావా? అవున్లే! నేను రిచ్చా కోనుక్కొనుంటె నాకు బాద్దెతుండేది. పొద్దస్తమానం రిక్షా తొక్కాల. అప్పు తీర్చాల. ఇంత బాద్దెత నెత్తి నుంటే నాకు సొతంత్రం యాడుంటుంది? అసలు బాద్దెతుండే బతులకు సొతంత్రం యాడేడిసింది? నువ్వు కావాలనుకున్నోంది సొతంత్రం. అయితే నేనిప్పుడు సొతంత్రుణ్ణి. నే నే వయిన పెయొచ్చు. జై గాంధీమాత్మాకూ జై!"

గబగబ బ్రాందీ అంగట్లో దూరాడు కోటిగాడు. సీసామీద సీసా సోడాతో కలిపి పట్టించాడు. వాడి కాళ్ళు తేలిపోతున్నాయి. ఒళ్ళు సొలిపోతూ ఉంది.

జేబులో భద్రపరచిన డబ్బును చేతికందు కొన్నాడు కోటిగాడు.

అప్పటికే ఆ బ్రాందీ అంగట్లో చాలా మంది స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్వస్వతంత్రంగా హాయిలో తేలిపోతున్నారు. వాళ్ళందరికీ డబ్బులు ఇవ్వబోతున్నాడు. వీడిస్థితిలోనే వాళ్ళూ ఉన్నారు. వీడికి డబ్బు విలువ తెలియనట్టే వాళ్ళకూ తెలియలేదు. అందుకే అందరూ వాడివైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"అందేం దబ్బా అట్లాసూస్తా ఉండారే? ఈడేంది యిట్లేచేస్తుండా డనిగదా? ఒరే పిచ్చినాయాలి గుంపా! ఇది అప్పు దెచ్చిన దుడ్డు కాదురా! తేరకొచ్చింది. నే నౌకరి కియ్యాల్సిన పనిన్లేదు. మీరు నా కియ్యాల్సిన పన్లేదు. తీసుకోండ్రా!"

కోటిగాడు బలవంతం చేస్తున్నాడు. అందరు విస్తుబోయి చూస్తున్నారు.

"మా యబ్బలో సెప్తా వుండా! ఈ మాట పెంటయ్యే సెప్పినాడు. రొండునాళ్ళు పచ్చంగా తిని ఎచ్చంగా పొణుకోమన్నాడు. నే నొకడే రొన్నాళ్ళు తినేదాని కంటే మన వంతా కలిసి ఒక్క దిన వే పచ్చంగా తిని ఎచ్చంగా ఉండేపోలే? ఏం తప్పా? ఆ మాటకొస్తే పెంటయ్య యిన్నారు తీసుకుంటే మీరు ఖరచై తీసుకుంటే తప్పా? తీసుకోండిరా! తీసుకోండి! ఎర్రిమొగం నాయాండ్లారా తీసుకోండి!" అంటూ చేతిలోని నోట్లను వెదజల్లాడు కోటిగాడు.

బ్రాందీషాపులోని ఫాన్ గాలికి రెక్కలు విప్పిన పావురాళ్ళలా ఎగురుతున్నాయి నోట్లు!

తూలుతో సొలుతూ నవ్వుల్లో తేలిపోతూ మళ్ళీ గాంధీ విగ్రహం ముందు పూలబడ్డాడు కోటిగాడు.

"సా వీ! 'సొతంత్రం! సొతంత్రం!' నువ్విట్లా నిలబడిపోయావు. సొతంత్రంగా బతకదా వనుకుంటే నేనిట్లా నిలబడిపోయినా! మనిద్దరూ ఒకటే, సా వీ! లేదంటే — నేను తాగినాను. నువ్వు తాగలేదు. ఒకరు తాగి యింకొకరు తాక్క పోతే అది పలపచ్చం. పలపచ్చం తప్పుసావీ! అంత తాగు. తాక్కపోతివే నా మీద ఒట్టే!"

బతిమాలుతున్నాడు కోటిగాడు.

గాంధీ విగ్రహం ముందు బ్రాందీ అంగడి పెట్టడానికి అనుమతించిన ప్రజలు కోటిగాడు గాంధీగారిని బ్రాందీ త్రాగుని బతిమాలుతూంటే— నవ్వుతూ అదో విం గా చూస్తున్నారు.

కోటిగాడు స్వతంత్రుడు! ❦



ఎంత హాయి ఈ రేయి ....

చిత్రం— మారేమండ శ్రీనివాసరావు

# మమత కవిత

మమత మనము పందిరిపై
కవిత పూలు పూచె
బాపురే! అనంతభావ
పరిమళాలు వీచె-

మాట మాట కలిసి వెలుగు
బాట మీద సాగె
ఊహలలో వాస్తవాలు
ఊయ్యాలలు ఊగె-

జన జీవనముల హసించె
అనుభూతుల ఆమని
నవతా బరముల రణించె
యువతా సౌదామిని-

మనిషిని దీవించె ప్రకృతి
మమతా మంటపమున
ప్రగతిని పూజించె మనిషి
సమతా మందిరమున-

— జె. బాపురెడ్డి